
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 15 జూలై 2024





రథంపై కొలువుదీరిన జగన్నాథ స్వామి

శివసత్తుల శిగాలు.. పోతరాజుల వీరంగం

గజ్వేల్, చిన్నకోడూరు, హుస్నాబాద్‌లో అట్టహాసంగా బోనాలు



గజ్వేల్ పట్టణంలో బోనాల ఊరేగింపు

గజ్వేల్, జూలై 14 : శివసత్తుల శిగాలు, పోతరాజుల నృత్యాల మధ్య గజ్వేల్ పట్టణంలో మహంకాళీ అమ్మవారి బోనాలను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ చైర్మన్ భాస్కర్, పూజారి చాడ నందబాలశర్మ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. పట్టణ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అమ్మవారిని దర్శించుకున్నారు.

హుస్నాబాద్‌లో వైభవంగా పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు

హుస్నాబాద్, జూలై 14 : హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, ఎల్లమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకొని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య పట్టణంలోని ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాలకు ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలను చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



చిన్నకోడూరులో బోనాలతో మహిళలు



హుస్నాబాద్‌లో ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

చిన్నకోడూరులో రేణుకా ఎల్లమ్మ తల్లికి..

చిన్నకోడూరు, జూలై 14 : మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మతల్లికి ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలను నివేదించారు. మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. అమ్మవారిని పలు రకాల కూరగాయాలతో అలకరించారు. అమ్మవారు భక్తులకు శాకాంబరిగా దర్శనమిచ్చారు.



వేంటక్వేరస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన రథయాత్ర



రథాన్ని లాగుతున్న ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు

వైభవంగా జగన్నాథ రథయాత్ర

సిద్దిపేట టౌన్, జూలై 14 : హరేరామ, హరే కృష్ణ సత్సంగ్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఆదివారం జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ రథయాత్రను ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి తాళ్లతో రథాన్ని లాగారు.



గజ్వేల్‌లో బోనం ఎత్తిన హరీశ్‌రావు

కాళేశ్వరంతో రిజర్వాయర్లు నింపాలి

గజ్వేల్, జూలై 14 : కాళేశ్వరం ప్రాజెక్టులో పారుతున్న జలాలతో సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నింపాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ఈఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వెంటనే ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోయాలని సూచించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కరువు నేపథ్యంలో వెంటనే జిల్లాలోని రిజర్వాయర్లను నింపడం ద్వారా ఈ ప్రాంత రైతులు కాలువలు, భూగర్భజలాలు పెంపొందడం ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉందని, ప్రభుత్వ ఆ దిశగా ఆలోచన చేయాలన్నారు. ఆయనవెంట ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తదితరులున్నారు.

సిద్దిపేట నా గుండెచప్పుడు

- లబ్‌డబ్‌కు బదులు సిద్దిపేట అని కొట్టుకుంటుంది
- పదవుల కంటే విద్యార్థుల విజయమే సంతృప్తినిచ్చింది
- టెన్త్‌లో అగ్రస్థానంతో గొప్ప అనుభూతి పొందాను
- విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిన హరీశ్‌రావు

సిద్దిపేట, జూలై 14 : తాను ఎక్కడున్నా తన మనసంతా సిద్దిపేట చుట్టే తిరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటే తన గుండెచప్పుడన్నారు. తన గుండె లబ్‌డబ్‌కు బదులుగా సిద్దిపేట..సిద్దిపేట అని కొట్టుకుంటుందని ఉద్వేగానికి లోనయ్యారు. తాను పదవులు పొందిన సంతృప్తి కంటే పదో తరగతిలో విద్యార్థులు సాధించిన విజయమే తనకు గొప్ప అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. తాను అమెరికాలో ఉన్నప్పుడే పదో తరగతి పరీక్షలు ఉండగా విద్యార్థుల తల్లిదండ్రులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించానని గుర్తుచేశారు. కాగా ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పదో తరగతిలో 10జీపీఏ సాధించడంతోపాటు బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్లు పొందిన విద్యార్థులకు తన సొంత ఖర్చుతో ట్యాబ్‌లు అందజేసి వారిని సత్కరించారు. ఐదేళ్లుగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు పారితోషికం, ఐప్యాడ్‌లు, ట్యాబ్‌లను అందిస్తున్నట్లు వివరించారు. అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిన సిద్దిపేటను మరో మెట్టు ఎక్కించిన ఘనత ఈ విద్యార్థులకే దక్కుతుందని కొనియాడారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉత్తీర్ణతను సాధించడమేగాకుండా 169 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన ఏకైక నియోజకవర్గం సిద్దిపేట అని గర్వపడ్డారు. ఒక తండ్రిగా పిల్లలను చూస్తుంటే కడుపు నిండిన సంతోషం కలిగిందని వివరించారు. ఇందుకు కారకులైన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు హరీశ్‌రావు ప్రస్తావించారు.



పదో తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు సొంత ఖర్చుతో ట్యాబ్‌లు అందజేసి సన్మానించిన హరీశ్‌రావు

బదిలీలలు



- టీచర్ స్పౌజ్ ట్రాన్స్‌ఫర్‌లలో అవకతవకలు?
- భర్త ఒక మండలంలో.. భార్య మరో మండలంలోకి
- అర్హులైన ఉపాధ్యాయులకు అన్యాయం

సిద్దిపేట క్రైం, జూలై 14 : ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల కోసం దారి తప్పారు. కొంతమంది అధిక హెచ్‌ఆర్‌ఏ ప్లేసుల కోసం అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలిసింది. ఈ అవకతవకలతో చాన్నాళ్ల తర్వాత జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో కొంతమంది స్పౌజ్ టీచర్లకు న్యాయంగా రావాల్సిన స్థానాలు దక్కలేదు.

నిబంధనలకు విరుద్ధంగా

స్పౌజ్ పాయింట్లు తీసుకునేవారు వారిలో భార్య, భర్త వారు పని చేసే మండలంలోనే బదిలీ స్థానాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. కోరుకున్న చోట ఖాళీ లేకపోతే పక్క మండలాలు ఆ తర్వాత మండలాలను ఎంపిక చేసుకోవచ్చు. అలాకాకుండా తమకు ఇష్టం ఉన్న మండలాలకు వెళ్లేలా ఆప్షన్లు ఇవ్వడం, అధికారులు పరిశీలించకుండానే ఆర్డర్లు ఇవ్వడంతో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని స్పష్టమవుతుంది. భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే వారి కోసం ప్రభుత్వం పది పాయింట్లను అదనంగా కేటాయించింది. ఇద్దరూ ఒకే మండలంలో దగ్గరగా ఉండే విధంగా వెసులుబాటు కల్పించింది. ఈ స్పౌజ్ పాయింట్లను భార్యభర్తలు ఇద్దరూ 8 ఏళ్లకు ఒకసారి ఎవరో ఒకరు మాత్రమే వినియోగించుకోవాలనే నిబంధన ఉన్నది. కానీ జిల్లాలో అందుకు విరుద్ధంగా స్పౌజ్ బదిలీలు జరిగినట్లు పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

పరిశీలించకుండానే బదిలీ ఆర్డర్లు

ఉపాధ్యాయులైన భార్యభర్తలకు బదిలీ తప్పనిసరి అయితే ఇద్దరినీ ఒకే మండలానికి గాని పక్కపక్క మండలానికి కానీ బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో స్పౌజ్ కేటగిరీలో ఉపాధ్యాయులు వారికి నచ్చిన పాఠశాల ఆప్షన్ ఎంచుకోవడంతో అధికారులు పరిశీలించకుండా బదిలీ ఆర్డర్లు ఇచ్చారు. మరి కొంతమంది ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లతో అర్హత లేకుండా హెచ్‌ఆర్‌ఏ ప్లేస్‌లోకి ఆర్డర్లు వచ్చాయని ఆరోపిస్తున్నారు. దీంతో న్యాయంగా రావలసిన పాఠశాలలు దక్కలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చాలా మంది స్పౌజ్ ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా బదిలీ అయినట్లు సమాచారం.



మోడల్ స్కూళ్ల టీచర్లు 11 ఏళ్లుగా ఒకేచోట..

మద్దూరు, జూన్ 14 : జిల్లాలోని 14 మోడల్ స్కూళ్లల్లో 2013 విద్యాసంవత్సరంలో విధుల్లో చేరి విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు లేకుండా పోయాయి. 11 సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్నారు. జోనల్ పోస్టు కావడం వల్ల సుదూర ప్రాంతాలలో ఉద్యోగం పొంది కుటుంబాలకు దూరంగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2014లో రెండో దశ పోస్టుల భర్తీ చేపట్టగా 2013లో భర్తీ జరిగిన వారికి స్లైడింగ్ అవకాశం ఇవ్వకుండా భర్తీ చేశారు. దీంతో తక్కువ మార్కులు వచ్చిన వారికి అనుకూలతతో పాటు పట్టణ ప్రాంతాలలో స్థానాలు లభించాయి. మెరిట్ అభ్యర్థులకు మారుమూల ప్రాంతాల్లో కేటాయింపు జరిగి అన్యాయం జరిగినట్లు ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. 2023 విద్యాసంవత్సరం ఆరంభంలో బదీలల కోసం నోటిఫికేషన్ వచ్చినా అనుకూల స్థానాలలో పని చేస్తున్న వారు బదిలీలు ఇష్టం లేక కొందరు హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడంతో బదిలీలు జరగలేదు. అనేక కేసులున్న ఉపాధ్యాయులకు బదిలీలతో పాటు ప్రమోషన్లకు అవకాశం ఇచ్చినా చిన్న కేసుందనే సాకుతో వివక్ష చూపెడుతున్నట్లు వాపోతున్నారు. ఈ క్రమంలోనే మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గ్రూపు తగాదాలు ఎక్కువై విద్యాబోధనపై అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

బదిలీ అయినా.. పాత స్థానాల్లోనే

ఇంకా రిలీవ్ కానీ 209 మంది టీచర్లు

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయి 10 రోజులైనప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారు. ఎక్కువ మంది ఉపాధ్యాయులు ప్రధాన రోడ్డు పక్కన పాఠశాలలు, సిద్దిపేట పట్టణానికి పరిసర ప్రాంతంలో ఉన్న బడులను ఎంచుకున్నారు. దూర ప్రాంతాల్లో ఉండే ఉపాధ్యాయులు రిలీవర్ లేక ఆదేస్థానంలో కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 636 ప్రాథమిక, 113 ప్రాథమికోన్నత, 227 జిల్లా పరిషత్ పాఠశాలలు వున్నాయి. వీటిలో ఎస్జీటీ ఉపాధ్యాయులు, 1920 స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలలో 1,032 మంది స్థానచలనం చెందారు. అయితే, దూర ప్రాంతాల్లో ఉండే పాఠశాలల్లో రిలీవర్ లేక బదిలీ అయిన ఉపాధ్యాయులు అక్కడే కొనసాగుతున్నారు. జిల్లాలో మొత్తం 209 మంది టీచర్లు పాత పాఠశాలల్లోనే విధులు కొనసాగిస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ కొత్త స్థానంలో జాయిన్ కాకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది బదిలీ ఉత్తర్వులు వచ్చి 15 రోజులు కావస్తున్న వారిని రిలీవ్ చేయకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

దౌల్తాబాద్ మండలంలో 49 మంది

జిల్లాలో దౌల్తాబాద్ మండలంలో అత్యధికంగా ఉపాధ్యాయులు రిలీవ్ కాలేదు. మండలంలో 49 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా, రిలీవ్ లేని కారణంగా 34 మంది ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాయపోల్ మండలంలో 26 మంది, జగదేవపూర్ మండలంలో 27 మంది, అక్కన్నపేట మండలంలో 17 మంది, కోహెడ మండలంలో 13 మంది, మద్దూరు మండలంలో 15 మంది ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా ఉన్నారు. సిద్దిపేటకు దగ్గరగా ఉండే ప్రతీ మండలంలో ఒకే ఉపాధ్యాయుడు ఉన్న బడుల్లోనూ రిలీవ్ కాకుండా కొనసాగుతున్నారు

డీఎస్సీ రిక్రూట్‌మెంట్ తర్వాతనే రిలీవ్?

ప్రభుత్వం డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేసిన తర్వాత ఈ ఉపాధ్యాయుల స్థానంలో కొత్త వారిని పంపించి రిలీవ్ చేసే ఆలోచనలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 724 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. ఈనెల 18వ తేదీ నుంచి డీఎస్సీ రాత పరీక్షలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ చివరిలో ఫలితాలు వచ్చే అవకాశం ఉన్నది. అప్పటివరకు ఉపాధ్యాయులు రిలీవ్ కానీ పరిస్థితి కనబడుతున్నది. విద్యా వలంటీరులను నియమించి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

‘మహాసముద్రం’కు మహర్దశ వచ్చేనా?

- అవుట్ ఫ్లో కెనాల్‌కు గండి పడి నాలుగేళ్లు
- కోతకు గురైన రహదారి
- సందర్శనకు వచ్చే పర్యాటకులకు తప్పని ఇబ్బంది
- కల్వర్టు నిర్మించాలని స్థానికుల వినతి

హుస్నాబాద్ రూరల్, జూలై 14 : హుస్నాబాద్ పట్టణం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉమ్మాపూర్ గుట్టల మధ్యన కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రకృతి రమణీయమైన జలాశయం మహాసముద్రం. దీని అవుట్ ఫ్లో కెనాల్‌కు గండి పడి నాలుగేళ్లు దగ్గరపడుతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి కొట్టుకుపోవడంతో చెరువు వద్దకు వెళ్లేందుకు ఇబ్బందుల తప్పడం లేదు.

దశాబ్దాల క్రితం మహాసముద్రం జలాశయంకు గండి పడగా, గండిని పూడ్చి నీటి నిల్వలు పెంచాలని ఈ ప్రాంత రైతులు ఎన్నో ఉద్యమాలు చేశారు. 2014లో తెలంగాణ ఏర్పాటు అనంతరం చెరువుపై ప్రత్యేక దృష్టి సారించారు. దాదాపు 62 ఏళ్ల క్రితం గండిపడిన మహాసముద్రంను అప్పటి సీఎం కేసీఆర్ 2015లో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా స్వయంగా మహాసముద్రం ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడే బహిరంగసభను ఏర్పాటు చేసి వనభోజనం చేశారు. ఈ సందర్భంగా గండి నిర్మాణం కోసం రూ.3.80 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సహకారంతో మహాసముద్రం గండి పనులకు మోక్షం లభించింది. 2019లో గండి పనులు పూర్తి చేశారు. గండి పూడ్చిన ఏడాదిలో వర్షాలు సమృద్ధిగా కురియడంతో సహజ సిద్ధంగానే గుట్టలపైభాగం నుంచి వచ్చిన వరద ప్రవాహానికి మహాసముంద్రం నిండి మత్తడి దూకింది. మత్తడి ద్వారా వెళ్లే అవుట్ ఫ్లో కెనాల్‌కు 2020 ఆగస్టులో కురిసిన భారీ వర్షానికి గండి పడింది. కల్వర్టుపై నుంచి తాత్కాలింగా ఏర్పాటు చేసి రహదారి కొట్టుకుపోవడంతో మహాసముద్రంకు వచ్చేందుకు దారి దిక్కులేకుండా అయింది. మూడేళ్లుగా ఈ రహదారిపై కల్వర్టు నిర్మించాలని రైతులు, సందర్శకులు అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. మత్తడి ద్వారా వచ్చే వరద ప్రవాహంతో వ్యవసాయబావుల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని అక్కడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత వర్షం నీరుతో జళకళను సంతరించుకున్న మహాసముద్రంను చూసేందుకు ఎక్కడిక్కడి నుంచో సందర్శకులు వచ్చేవారు. కానీ ఇక్కడికి వచ్చిన తర్వాత రహదారి భారీ కోతకు గురికావడంతో ఇబ్బందులు తప్పడం లేదు.



గుట్టల మధ్య ఉన్న మహాసముద్రం జలాశయం



మహాసముద్రం జలాశయానికి వెళ్లే దారి

మంత్రి పొన్నం హామీ

ఇటీవల స్థానిక రైతులు కలిసి కల్వర్టు రహదారిని బాగుచేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి మహాసముద్రం ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎలాంటి నిధులను మంజూరు చేయలేదు. వర్షాకాలంలో రహదారిపై కల్వర్టు నిర్మిస్తారో లేదోనని పర్యాటకుల ప్రశ్నిస్తున్నారు.



భారీ వర్షాలకు కోతకు గురైన అవుట్‌ఫ్లో కెనాల్ (ఫైల్)

పాలన గాలికి వదిలేసిన ముఖ్యమంత్రి

- ఇతర పార్టీ నేతలను చేర్చుకోవడంపైనే శ్రద్ధ
- ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట అర్బన్, జూలై 14 : రాష్ట్రంలో పాలనను పూర్తిగా గాలికి వదిలేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నడపడంలో పూర్తిగా విఫలమయ్యాడని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట అర్బన్ మండలం బక్రీచెప్యాల సమీపంలో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద ఆయన మొక్కను నాటారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీ దేశంలోని 736 జిల్లాలో నేటికీ 550 జిల్లా కార్యాలయాలను నిర్మించుకుని, భవిష్యత్ తరాలకు ఉపయోగంలోకి తెచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్మించిన బీజేపీ జిల్లా భవనాన్ని త్వరలో జేపీ నడ్డాతో ప్రారంభించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. అన్ని సౌకర్యాలతో పాటు ఆధునిక లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ కలలు కన్నట్టు ప్రజాస్వామ్యంలో ప్రజాపరిపాలన కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. రేవంత్‌రెడ్డి పక్క పార్టీలో ఉన్న నాయకులను తమ పార్టీలో చేర్చుకునే దానిపై పెట్టిన శ్రద్ధ ప్రజా సమస్యలపై, పరిపాలనపై పెడితే బాగుంటుందన్నారు. సీఎం హోదాలో రోజుకొకరికి కండువా కప్పుతున్నాడని, ఇదేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటిన ఎంపీ రఘునందన్‌రావు

అప్రజాస్వామ్య విధానాలపై రాహుల్‌గాంధీ స్పందించాలి

గజ్వేల్, జూలై 14 : రాష్ట్రంలో జరుగుతున్న అప్రజాస్వామ్య చేరిక విధానంపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందించాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మహంకాళీ బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో కేసీఆర్ సంతలో పశువుల్లా ఎమ్మెల్యేలను కొనుగోలు చే స్తే ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సైతం అదే బాటన పయనిస్తున్నారని, ఆయనకు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. రాజ్యాంగం చేతిలో పట్టుకుని తిరుగుతున్న రాహుల్‌గాంధీ అప్రజాస్వామ్య చేరికలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు వేరే పార్టీ కండువా కప్పుకున్న అనంతరం ఎమ్మెల్యేగా డిస్ క్వాలిఫై చేయాలని, కర్ణాటక కోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించాలన్నారు. తెలంగాణలో జరుగుతున్న అప్రజాస్వామ్య చేరికపై మేధావులు, న్యాయమూర్తులు, నాలుగో స్తంభం అయిన మీడియా ప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నాయకులు జశ్వంత్‌రెడ్డి, మనోహర్‌యాదవ్, నాయిని సందీప్, సురేశ్, మహేశ్ తదితరులున్నారు.

ఫైజాబాద్, నర్సాపూర్‌లో దొంగల బీభత్సం

చిలప్‌చెడ్/నర్సాపూర్, జూలై 14: చిలప్‌చెడ్ మండలంలోని ఫైజాబాద్‌లో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల కృష్ణ దంపతులు శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి కౌడిపల్లి మండలం దేవులపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అదే అదునుగా భావించిన దుండగులు తాళం పగలగొట్టి బీరువాలోని రూ.19వేలు, 25 తులాల వెండి పట్టీలను అపహరించారు. ఆ పక్కనే ఉన్న తాళ్ల బాల మల్లయ్య ఇంటి తాళం పగలగొట్టి చోరీకి యత్నించారు. అలికిడిని విని పక్కింటి వారు రావడంతో పరారయ్యారు. గ్రామశివారులో గల ధర్మపురి శశికాంత్‌కు చెందిన షెడ్‌లో ఉన్న కటికె యాదుల్లకు చెందిన 5 గొర్రెలను అపహరించారు. వాటి విలువ రూ.50వేల ఉంటుందని తెలిపారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు విచారణ చేపట్టారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్‌ఐ మహబూబ్ తెలిపారు. గ్రామంలో ఒకేరోజు వరుస చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.


ఫైజాబాద్‌లో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

నర్సాపూర్‌లో..

నర్సాపూర్‌లో శనివారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన న్యాయవాది శంకర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. ఆదివారం ఉదయం తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లిచూడగా బీరువాలోని రెండు తులాల బంగారం చోరీ అయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.


జహీరాబాద్ రైల్వేస్టేషన్

జహీరాబాద్ అభివృద్ధికి మహర్దశ

- రూ.6350 కోట్లతో 350 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్
- వికారాబాద్ నుంచి పర్లీ వరకు డబుల్ రైల్వేలైన్
- తాండూర్ నుంచి జహీరాబాద్ వరకు కొత్త రైల్వేలైన్

జహీరాబాద్, జూలై 14: రవాణారంగాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ ప్రజలకు రైలు ప్రయాణం సులభతరం కానున్నది. దీనికితోడు జహీరాబాద్‌కు నిమ్జ్(జాతీయ ఉత్పాదక మండళ్లు) ఏర్పాటు కావడంతో మున్ముందు మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉండడంతో జహీరాబాద్ అభివృద్ధికి మహర్దశ పట్టనున్నది.

కొత్త రైల్వే లైను

2023-24 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వే రంగం అభివృద్ధికి తెలంగాణకు ప్రాధాన్యం కల్పించారు. తెలంగాణవ్యాప్తంగా రూ.50,848 కోట్లతో 2,647 కిలోమీటర్ల మేర నూతన లైన్లు విస్తరించేలా ఏర్పాట్లు చేశారు. వీటితోపాటు అదనంగా డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రాప్లింగ్‌లకు సంబంధించి 11 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. అందులో భాగంగా రూ.32.695 కోట్లతో దాదాపు 2,700 కిలోమీటర్ల మేర పనులను చేపట్టనున్నారు. సుమారు రూ.6350 కోట్లతో 350 కిలోమీటర్ల మేర కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కానున్నది. ఇందులో వికారాబాద్ నుంచి పర్లీ వరకు 273 కిలోమీరట్లకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయగా.. వికారాబాద్ జిల్లా తాండూర్ నుంచి జహీరాబాద్‌కు 75 కిలోమీటర్ల మేర సుమారు రూ.1,350 కోట్లతో కొత్త రైల్వేలైన్ వేయనున్నారు. సర్వే పనులు కూడా దగ్గర పడ్డాయని రైల్వేశాఖ అధికారులు వివరించారు. ఈ పాటికే జహీరాబాద్ మీదుగా రైల్వేలేన్ ఉండడానికి తోడు అమృత్‌భారత్ స్టేషన్‌లో భాగంగా రూ.25 కోట్లతో రైల్వేస్టేషన్ పనులు ఊపందుకున్నాయి. వికారాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా పర్లీ వరకు రూ.5 వేల కోట్లతో 273 కిలోమీటర్ల మేర డబుల్ రైల్వేలైన్ వేయడం, ఉన్న రైళ్లకు తోడు అదనంగా రైళ్లు రావడం, వికారాబాద్ జిల్లా తాండూర్ నుంచి జహీరాబాద్ వరకు మరో కొత్త రైల్వే లైన్ వేయడం లాంటి పనులకు శ్రీకారం చుట్టడంతో జహీరాబాద్ ప్రాంత ప్రజలకు రైలు ప్రయాణం మరింత సులభం కానున్నది. అలాగే తాండూర్ సిమెంట్ క్లస్టర్ నుంచి 75 కిలోమీటర్ల మేర జహీరాబాద్‌కు కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకానున్నది. ఇందుకుగాను రూ.1.350 కోట్లమేర ఖర్చు చేయనున్నారు. అయితే వికారాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా పర్లీ వరకు 273 కిలోమీటర్ల మేర డబుల్ రైల్వేలైన్ ఏర్పాటుచేసే దిశగా దక్షిణ మధ్య రైల్వే ఆమోదం తెలిపింది. వికారాబాద్ నుంచి పర్లీ వరకు సుమారు 25 గ్రామాలను కలుపుతూ రైల్వే లైన్ వేయనున్నారు. ప్రస్తుతం రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే పనులు కొనసాగుతున్నాయి. వికారాబాద్ నుంచి లాతూర్ 213 కిలో మీటర్లమేర సర్వేపనులు పూర్తయ్యాయని, మరో 60 కిలోమీటర్లు సర్వేచేస్తే పనులు త్వరలో పూర్తికానున్నాయని రైల్వే శాఖ అధికారులు వివరించారు. సర్వేపనులు పూర్తైన వెంటనే రైల్వేలైన్ల ఏర్పాటు 900 పైచిలుకు బ్రిడ్జీలు తదితరాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వికారాబాద్ మర్పల్లి, గేటువనంపల్లి, కోహీర్, మెటల్‌కుంట, జహీరాబాద్, బీదర్, బాల్కి, కమల్‌నగర్, ఖానాపూర్, కల్గాపూర్, హీర్, చాకూర్, వడ్వాల్, జాన్వాల్, ఉద్గీర్, లాతూర్, పాన్‌గల్ ఘాట్, నల్‌దుర్గ్ స్టేషన్ల మీదుగ పర్లీ వరకు రైల్వే లైన్లను వేయనున్నారు. 273 కిలోమీటర్లకుగాను 900 బ్రిడ్జీలు ఏర్పాటు చేయనున్నారు.

ముంబయి, ఢిల్లీలకు ప్రయాణం సులభం

గతంలో జహీరాబాద్ నుంచి ముంబయి, ఢిల్లీ లాంటి పెద్ద పట్టణాలకు వెళ్లాలంటే హైదరాబాద్‌లోని రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చేది. జహీరాబాద్ మీదుగా రెండు (డబ్లింగ్)లైన్లు ఏర్పాటు చేయడంతో ఇక్కడి నుంచే ఆయా ప్రధాన పట్టణాలకు చేరుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. రైల్వేలైన్ ఏర్పాటు వల్ల రైళ్ల సంఖ్య 30 నుంచి 70కి పెరుగనున్నది. జహీరాబాద్ మీదుగా ప్రస్తుతం 20 ప్యాసింజర్ రైళ్లు, 10 గూడ్స్ రైళ్లు వెళ్తున్నాయి. మున్ముందు 50 ప్యాసింజర్ రైళ్లు, మరో 20 గూడ్స్ రైళ్లు తిరగనున్నాయి. మరో రెండేళ్లలో పనులు పూర్తికానున్నాయని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.


జహీరాబాద్ రైల్వేస్టేషన్

ప్రయాణికులకు మరింత ప్రయోజనం



రైల్వేలేన్ల ఏర్పాటుతో జహీరాబాద్ ప్రాంత ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరనున్నది. ఓవైపు నిమ్జ్‌రావడం, మరోవైపు రైల్వేరంగం అభివృద్ధి చెందడంతో జహీరాబాద్ ప్రజలకు మేలు చేకూరనున్నది. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా బస్సుల ద్వారా కాకుండా రైలు ద్వారా వెళ్లే సౌకర్యం కలగడం సంతోషం.

- రాములునేత, మాజీ కౌన్సిలర్

రైల్వే అభివృద్ధికి కేంద్రం కృషి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో రైల్వే రంగం అభివృద్ధి చెందింది. సామాన్యులకు సైతం రైలు ప్రయాణం సులభతరం చేసేదిశగా దేశవ్యాప్తంగా రైళ్లను, రైల్వేలైన్ల సంఖ్య పెరిగాయి. జహీరాబాద్ మీదుగా మరో రైల్వేలైన్లు రావడం సంతోషం. అన్నిరంగాల్లో జహీరాబాద్ మున్ముందు అభివృద్ధి చెందనున్నది. అమృతభారత్‌లో భాగంగా రైల్వేస్టేషన్‌లో పనులు జరుగుతున్నాయి.

- శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు

రోజుకు 70 రైళ్ల రాకపోకలు



వికారాబాద్ నుంచి పర్లీ వరకు ఉన్న రైల్వేలైన్‌కు తోడు అదనంగా మరో రైల్వే లైన్ రావడంతో ప్రయాణీకులకు సౌకర్యవంతంగా మారనున్నది. ప్రస్తుతం ప్రతిరోజు 30 రైళ్లు జహీరాబాద్ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్తున్నాయి. మరో రైల్వేలైన్ ఏర్పాటైతే 30 రైళ్లు అదనంగా వెళ్లనున్నాయి. దాదాపు రైల్వేలైన్ సర్వే పనులన్నీ పూర్తి దశకు చేరుకున్నాయి.

- మాధవక్రిష్ణ, సేషన్ మేనేజర్, జహీరాబాద్

బైక్‌ను ఢీకొట్టిన కారు

- వృద్ధురాలు మృతి, వ్యక్తికి గాయాలు


గాయపడ్డ వ్యక్తి

రామాయంపేట, జూలై 14: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో వృద్ధురాలు మృతిచెందగా.. వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి రామాయంపేట బైపాస్‌లో జరిగింది. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన రంగమ్మ(70) కొడుకు బాబురావుతో కలిసి రామాయంపేటలోని బంధువు వద్దకొచ్చింది. తిరుగు ప్రయాణంలో బైపాస్ జంక్షన్ వద్ద బైక్ మలుపుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో రంగమ్మ అక్కడికక్కడే ప్రాణాలొదలగా.. బాబురావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం

రామచంద్రాపురం, జూలై 14: రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ వలస కూలీ దుర్మరణం పాలైన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రవీందర్ వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన లక్ష్మణ్(23), మిథున్(22) జీహెచ్‌ఆర్ నిర్మాణ సంస్థలో కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం పని ముగించుకుని జన్వాడ రోడ్డులో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రగాయాలపాలైన మిథున్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు.

పాన్‌షాపుపై పోలీసుల దాడి

- నిషేధిత గుట్కాలు సీజ్

హత్నూర, జూలై 14: హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలో గల ఓ పాన్‌షాపుపై దాడిచేసి నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు. దేవులపల్లి గ్రామానికి చెందిన మన్నె పండరి పాన్‌షాపులో నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా.. సుమారు రూ.30 వేల విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిషేధిత గుట్కా ప్యాకెట్లు ఎక్కడైనా జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

వసతి గృహ విద్యార్థుల ఆందోళన

- ఉదయం 9:30 గంటల వరకు టిఫిన్ పెట్టని వైనం
- అందుబాటులో సిబ్బంది ● ఖాళీ ప్లేట్లతో విద్యార్థుల నిరసన


హత్నూరలో బీసీ బాలుర వసతి గృహం వద్ద ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

హత్నూర, జూలై 14: వసతి గృహ విద్యార్థులకు టిఫిన్ పెట్టకపోవడంతో ఖాళీ కడుపులతో కంట నీరు పెట్టారు. ఖాళీ ప్లేట్లు చేత పట్టి వసతి గృహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన హత్నూర బీసీ బాలుర వసతి గృహంలో 80మంది విద్యార్థులు ఉన్నా.. ఆదివారం ఇతర కారణాల వల్ల కొంతమంది ఇంటికి వెళ్లారు. సుమారు 30 మంది వరకు వసతి గృహంలోనే ఉన్నారు. వంట మనిషి, కామటి, వాచ్‌మన్ అందుబాటులో ఉండాల్సి ఉండగా.. ఉదయం 9:30 గంటల వరకు ఏ ఒక్కరూ విధులకు హాజరు కాలేదు. దీంతో విద్యార్థులు ఖాళీ కడుపులతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్లేట్లు చేత పట్టుకొని నిరసన తెలిపినా.. పట్టించుకునే వారు కరువయ్యారు. సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులే చికెన్ సెంటర్‌కి వెళ్లి మూడుకిలోల చికెన్ తెచ్చుకున్నారు. వారానికి ఒకసారి కూడా కోడిగుడ్లు ఇవ్వడం లేదని విద్యార్థులు ఆరోపించారు. ఈ విషయమై ఇన్‌చార్జి వార్డెన్ భద్రిప్రసాద్‌ను సంప్రదించగా.. సిబ్బంది ఆలస్యంగా విధులకు రావడంతో పొరపాటు జరిగిందని, మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.

'అందుబాటులో లేని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

కల్హేర్, జూలై 14: కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిలో అందుబాటులో లేని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కల్హేర్ కమ్యూనిటీ ఆస్పత్రికి సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన లొద్ద ప్రనూషను ఆదివారం ఉదయం 7:45 గంటలకు 108 అంబులెన్స్‌లో ప్రసూతి కోసం భర్త వెంకటేశం, కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. ప్రనూషకు పురిటినొప్పులు తీవ్రమవుతున్నా.. ఆస్పత్రిలో ఒక్క సిబ్బంది కూడా అందుబాటులో లేరు. ఇద్దరు శానిటేషన్ వర్కర్లు మాత్రమే ఉన్నారు. దీంతో మహిళ భర్త, కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 45 నిమిషాల అనంతరం ఓ ఏఎన్‌ఎం వచ్చి డెలివరీ చేయడంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కమ్యూనిటీ ఆస్పత్రి అయి ఉండి ఒక్క వైద్యుడు కానీ, సిబ్బంది కానీ లేకపోవడం ఏంటని, అందుబాటులో లేని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.



పస్క పండుగలో ప్రసంగిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

పండుగలు ఆధ్యాత్మిక చిహ్నాలు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట, జూలై 14: పండుగలు ఆధ్యాత్మిక చిహ్నాలుగా నిలుస్తాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం డాకూరులోని చర్చి ఆవరణలో నిర్వహించిన పస్క పండుగకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగేవేళ, ప్రజలు పస్క పండుగ పేరిట వన భోజనాలు చేయడం ప్రకృతితో మమేకమవ్వడంలో భాగమన్నారు. ఇలాంటి పండుగలు జరుపుకోవడం ద్వారా ప్రజల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, ఆనాటి ఆచారాలను పాటించినట్టవుతుందని చెప్పారు. అనంతరం మంత్రిని చర్చి పాస్టర్లు పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పీ.జైపాల్‌రెడ్డి, ఆర్డీవో పాండు, అక్సానిపల్లి సొసైటీ చైర్మన్ జీఆర్.నరేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పద్మనాభరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శివరాజ్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

టేక్మాల్, జూలై 14: ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధమైన సంఘటన చెంద్రుతండా గ్రామంలోని వాసురంతండాలో చోటు చేసుకున్నది. తండాకు చెందిన సుములనాయక్‌కు చెందిన పూరిగుడిసెలో మంటలు అంటుకుని గుడిసె మొత్తం దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లోని రూ.లక్ష నగదు, వంట సామగ్రి, దుసుతలు పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

- శ్రమజీవులంతా కుల, మతాలకతీతంగా జరుపుకునే పండుగ


పంచగామలో స్థాపించిన పీర్లు

నారాయణఖేడ్/జగదేవ్‌పూర్, జూలై 14: తెలంగాణ ప్రాంతంలో కుల, మతాలకతీతంగా మొహర్రం పర్వదినాన్ని జరుపుకుంటారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో పూర్వం నుంచి కూడా పీర్లపండుగ(మొహర్రం)ను ఘనంగా జరుపుకునేవారు. ఒక ఊరికి చెందిన పీర్లను మరో ఊరికి జనం డప్పుచప్పుళ్ల మధ్య తీసుకెళ్లి ఉత్సవాలు నిర్వహించుకునేవారు. పూర్వకాలంలో అరాచకం రాజ్యమేలుతున్న సమయంలో పాలకులు రాక్షసత్వంతో ప్రజలపై అణచివేత ధోరణిని సాగించారు. దీంతో అప్పట్లో అరాచకాలను ఎదిరించి హస్సైన్, హుస్సేన్ అనే సోదరులు పాలకులపై తిరుగుబాటు చేసి ప్రజల పక్షాన పోరాటం చేసి రాజుల క్రూరత్వానికి బలైనట్లు కథలుగా చెప్పుకుంటారు. ప్రజల పక్షాన నిలిచి ప్రాణాలను బలిదానం చేసినందువల్లే నిజాం పాలిత ప్రాంతమైన తెలంగాణలో హిందూ, ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారు. అయితే ఈనెల 17న నిర్వహించనున్న మొహర్రం వేడుకలకు ఇప్పటికే గ్రామాల్లో పీర్లను నిలిపారు. నారాయణఖేడ్ పట్టణంలోనూ పీర్ల అలంకరణకు ఉపయోగించే సామగ్రికి తోడు హలై ఆడే కళాకారులు ధరించేందుకు అవసరమైన సామగ్రిని విక్రయించేందుకు సిద్ధం చేశారు. అలాగే సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల పండుగ జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నామని దౌలపూర్ నిర్వాహకులు జాఫర్, డిజీ వెంకటేష్, చాకలి సాయిలు, కుమ్మరి ఎల్లయ్య, బాలయ్యలు తెలిపారు.


పంచగామలో ఆడేందుకు తయారు చేసిన హలై(అగ్నిగుండం)

52 ఫీట్ల జెండా ఎగురవేస్తాం



తమ గ్రామంలో పీర్ల పండుగను పురస్కరించుకుని ప్రతీ రెండేళ్లకోసారి 52 ఫీట్ల ఎత్తుగల కర్రతో జెండాను ఎగురవేస్తాం. తమ గ్రామంలో ఉత్సవాలను తిలకించేందుకు అనేక గ్రామాల నుంచి ప్రజలు వస్తారు. పూర్వకాలంలో తమ గ్రామంలో దీపాలు వెలిగించడానికి కిరోసిన్ లేక నీటి ద్వారా వెలిగించిన పీర్ల మహిమతో దీపాలు వెలిగినట్లు పూర్వీకులు చెబుతున్నారు.

- పట్లోళ్ల విఠల్‌రెడ్డి, పంచగామ మాజీ సర్పంచ్


కుటుంబ సమేతంగా మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి ఎన్‌వీ.శ్రావణ్‌కుమార్

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

చేర్యాల, జూలై 14: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎన్‌వీ.శ్రావణ్‌కుమార్ ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు అర్చకులచే పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామివారికి అభిషేకం జరిపించి, ప్రసాదం అందించి ఆశీర్వదించారు. అంతకుముందు కొమురవెల్లి పోలీసులు గెస్ట్‌హౌజ్ ఆవరణలో గౌరవ వందనం చేశారు. ఆయన వెంట హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్‌ఐ రాజు ఉన్నారు. అలాగే కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు మొక్కు బడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానచరించి పూజలు చేశారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది.

మొక్కులు తీర్చుకున్న ఎంపీ

రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ మల్లన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్పాటకం లక్ష్మారెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, చెరుకు రమణారెడ్డి, సార్ల లింగం, గుండా చంద్రం, శ్రీనాథ్‌రెడ్డి, పుట్ట రమేశ్, ఏర్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.


మల్లన్నను దర్శించుకున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

మియాపూర్-పటాన్‌చెరు రూట్‌లో డబుల్ డెక్కర్

- 13 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి మధ్యలో మెట్రో ట్రాక్
- ధార్మిక కట్టడాలు, ఇరుకైన ప్రాంతాల్లో డబుల్ డెక్కర్ ప్రతిపాదనలు
- ఎన్‌హెచ్‌ఏఐ, హెచ్‌ఏఎంఎల్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- సిస్ట్రా ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ నిపుణుల ప్రతిపాదన



పటాన్‌చెరు, జూలై 14: మెట్రోరైలు ప్రాజెక్టు రెండో దశలో భాగంగా మియాపూర్ నుంచి పటాన్‌చెరు సర్వే పనులు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్), నేషనల్ హైవేస్ అథారిటీస్ ఆఫ్ ఇండియా అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్న సిస్ట్రా ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ నిపుణులు మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు డబుల్ డెక్కర్ విధానాన్ని ప్రతిపాదించారు. ఈ రూట్లో ధార్మిక కట్టడాలు, ఇరుకు రూట్లకు అనుగుణంగా మెరుగైన ఇంజనీరింగ్ పద్ధతులను అనుసరించి, స్థలాభావ పరిస్థితులకు అనుగుణంగా డబుల్ డెక్కర్ డిజైన్ రూపొందించారు. మదీనగూడ నుంచి గంగారం దారిలో, బీహెచ్‌ఈఎల్ చెక్‌పోస్టు నుంచి అశోక్‌నగర్ వరకు ఈ పద్ధతుల్లో డబుల్ డెక్కర్ విధానంలో ట్రాక్‌ను నిర్మించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. కింది వరుసలో జాతీయ రహదారిపై వరుసలో మెట్రోట్రాక్‌ను ఏర్పాటు చేస్తారు. జాతీయ రహదారిపై రవాణాకు ఆటంకం ఏర్పడకుండా పై అంతస్తులో మెట్రోట్రాక్‌ను నిర్మించేందుకు వీలుగా డిజైన్లను సిద్ధం చేస్తున్నారు. భెల్ జంక్షన్‌లో ప్రస్తుతం భారీ ఫ్లై ఓవర్ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై డబుల్ డెకర్ ఫ్లై ఓవర్‌తో పాటు సమీకృత మెట్రోస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ నిర్మించేలా ఇంజనీర్లు డిజైన్లను సూచిస్తున్నారు. మియాపూర్ టూ పటాన్‌చెరు రూట్లో మెట్రో విస్తరణ డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, డిజైన్లకు తుది మెరుగులు దిద్దుతున్నామని హెచ్‌ఏఎంఎల్ అధికారులు పేర్కొన్నారు. జాతీయ రహదారి రూట్లో మెట్రో రావడంతో పౌర రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. రూ.20వేల కోట్లతో చేపడుతున్న మెట్రో రెండో విస్తరణలో మియాపూర్ పటాన్‌చెరు రూట్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. పటాన్‌చెరు నుంచి హైదరాబాద్‌కు నిత్యం లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. మెట్రో రాకతో మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలగనుంది.

పటాన్‌చెరుకు మెట్రో పరుగులు పెట్టేందుకు కృషి



మెట్రో రైలు ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసి పటాన్‌చెరు పారిశ్రామికవాడ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. భవిష్యత్తులో పటాన్‌చెరుతో పాటు సంగారెడ్డి వరకు విస్తరించాలన్న తన ప్రతిపాదనలను అమలు చేసేలా చూస్తున్నాం. కేంద్రం వాటాగా రావాల్సిన నిధులను సకాలంలో అందించేందుకు తోడ్పాటునందిస్తాం. మెట్రో రైలుతో పారిశ్రామికవాడ ప్రజలతో పాటు సంగారెడ్డి జిల్లా ప్రజలకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుంది. ఎంపీగా గెలిచిన వెంటనే మొదటిసారిగా మెట్రో అధికారులను కలిసి డీపీఆర్ సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశాను. సత్వరం ప్రాజెక్టు కార్యరూపం దాల్చి పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తాను.

- రఘునందన్‌రావు, మెదక్ ఎంపీ

జిల్లా కేంద్రంలో విస్తృత తనిఖీలు

● అదనపు డీసీపీ మల్లారెడ్డి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, జూలై 14: వాహనాల తనిఖీల్లో 52 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు అదనపు డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు రాజీవ్ రహదారిపై, ఇతర రహదారులపై విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో వాహనాల తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపిన వారికిపై 343కాంటాక్ట్ కేసులు, 592 నాన్ కాంటాక్ట్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ చలాన్ పెండింగ్ ఉన్న 111 వాహనాలను గుర్తించి వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన డబ్బులను వాహనదారులతో కట్టించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా నివారించడం కోసం, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

ప్రభుత్వాల ప్రలోభాలు, ఒత్తిళ్లకు లొంగలేదు

● సరస్వతి అక్క 23 ఏళ్లు పలు పదవుల్లో ప్రజాసేవ చేశారు

● ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్, జూలై 14: ఉద్యమ సమయంలో సరస్వతి అక్కను, నారాగౌడ్‌ను ఆనాటి ప్రభుత్వాలు ఎన్నో ప్రలోభాలు, ఒత్తిళ్లకు గురిచేసిన లొంగకుండా పని చేశారని, ప్రత్యేకరాష్ట్ర సాధన కోసం సరస్వతి అక్క, ఆమె కుటుంబం కేసీఆర్‌కు చేదోడు వాదోడుగా పని చేసిందని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లిలో ఆదివారం నిర్వహించిన మాజీ ఎంపీపీ మెరుపుల సరస్వతీ విగ్రహ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సరస్వతి అక్క 23 ఏళ్లుగా వివిధ పదవుల్లో ప్రజాసేవ చేశారని చెప్పారు. అక్క మీద ఉన్న ప్రేమను, గౌరవాన్ని మాటల్లో చేప్పలేనన్నారు. ఊరికి వేళ్తే చాయ్ తాగకుండా పోనిచ్చేవారు కాదని, రోడ్లు ఎప్పుడు వేస్తారని నిలదీసేవారని గుర్తు చేశారు. ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంచిపని చేస్తే చరిత్రలో మిగిలిపోతారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నారాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదయ్య, మాజీ జడ్పీటీసీ బాల్ రంగం, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు కిషన్‌రెడ్డి, బాలకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్ది పేట టౌన్: చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కార్యకర్తలను కాపాడుకుంటా

సిద్దిపేట టౌన్/చిన్నకోడూరు, జూలై 14: సభ్యత్వం ఉన్న ప్రతీ కార్యకర్తకు పార్టీ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించిందని, పార్టీ కార్యకర్తలు ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబసభ్యులకు అండగా నిలిచేందుకు ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నామని ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కును ఆదివారం సిద్దిపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలకు చెందిన జిర్ర శ్రీనివాస్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందాడు. రూ. 2 లక్షల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును మృతుడి భార్య లావణ్యకు, సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన ఎర్ర మల్లేశం రోడ్డు ప్రమాదంలో మరణించగా అతని భార్య మంజులకు రూ. 2 లక్షల చెక్కును ఆయన అందజేశారు. చిన్నకోడూరు మండలంలోని పెద్దకోడూరు గ్రామ మాజీ సర్పంచ్ సామల అంజలి (55) ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, తాజా మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, సర్పంచులు ఉమేష్ చంద్ర, లింగం, ఎల్లయ్య బీఆర్ఎస్ నాయకులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈత మొక్కలు నాటిన హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, జూలై 14: గౌడ కులస్థులు కులవృత్తిలో రాణించాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాక్షించారు. సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లిలో గౌడ కులస్థులతో కలిసి ఆదివారం ఈత మొక్కలను నాటారు. కార్యక్రమంలో గ్రామ గౌడకుల పెద్దలు, స్థానిక తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడి మృతి

హుస్నాబాద్‌రూరల్, జూలై 14: టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం కన్నారం గ్రామానికి చెందిన మూడిక అయిలయ్య(80) హుస్నాబాద్‌లోని మందుల దుకాణంలో మందులు తీసుకుని పోతారం(ఎస్)లోని తన మేనల్లుడి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. పోతారంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మహేష్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చేర్యాల, జూలై 14: చేర్యాల పట్టణ శివారు వీవర్స్ కాలనీకి చెందిన భవన నిర్మాణరంగ కార్మికుడు శివుడు (36) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. మార్బుల్ పని చేస్తూ జీవిస్తున్న శివుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడడాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆత్మహత్యకు కుటుంబ, ఆర్థిక ఇబ్బందులు కారణమని తెలిసింది.

రేషన్ బియ్యం పట్టివేత

చిన్నకోడూరు, జూలై 14: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు పట్టుకున్నారు. చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామ శివారులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు దాడి చేసి 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఇబ్రహీంనగర్‌కు చెందిన కనకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్టోన్‌క్రషర్ల ఏర్పాటుపై పోరాటానికి జేఏసీ

● జేఏసీ అధ్యక్షుడిగా విజయ్‌గౌడ్ ఎన్నిక



జేఏసీ ఏర్పాటు కోసం గ్రామసభ నిర్వహిస్తున్న గ్రామస్థులు

జిన్నారం, జూలై 14: జిన్నారం మండలం మాదారంలో స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఏర్పాటు చేసి ఆందోళనలు నిర్వహించాలని గ్రామ సభలో నిర్ణయించారు. ఆదివారం పంచాయతీ కార్యలయం వద్ద గ్రామ సభను నిర్వహించారు. కొన్ని రోజులుగా గ్రామ పరిధిలో కంకర మిషన్లు, క్వారీల ఏర్పాటకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలపై చర్చించారు. ఇకపై జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జేఏసీ కమిటీ ఏర్పాటు

మాదారం గ్రామ జేఏసీ అధ్యక్షుడిగా విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా అరేందర్ గౌడ్, భాస్కర్ యాదవ్, జనరల్ సెక్రటరీగా రమణసింగ్, అనీల్‌కుమార్, ట్రెజరర్‌గా మహేందర్‌గౌడ్, గణేష్, కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, నర్సింగరావు, అంబదాస్, బాలేష్, బాబు, ప్రసాద్, పాండు, రాజులు ఎన్నికయ్యారు.

'కొమ్మూరి' ఇంటిని ముట్టడిస్తాం: సీపీఎం

చేర్యాల, జూలై 14: మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆక్రమించిన భూదాన్, సీలింగ్, వెంచర్ భూములను ప్రభుత్వానికి, ప్రజలకు వెంటనే అప్పగించాలని, లేనియెడల ఇంటిని ముట్టడిస్తామని సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో హెచ్చరించారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులను లోబరుచుకుని, రికార్డులను మార్చుకుని కొమ్మూరి అక్రమంగా భూదాన్, సీలింగ్ భూములను అనుభవిస్తున్నాడని ఆరోపించారు. కొమ్మూరి ఎంగిలిమెతుకులకు కక్కుర్తిపడి వాస్తవాన్ని గ్రహించని కొందరు సీపీఎంను విమర్శించే ముందు తమనేత నైజాన్ని గుర్తించి మసలుకోవాలని హితవు పలికారు. ఉనికికోసం సీపీఎంను విమర్శిస్తే ప్రజలు హర్షించరని, సీపీఎం ఊసెత్తే నైతికత లేదన్నారు. వెంటనే భూములను అప్పగించని యెడల ప్రజాపోరాటాలతో గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో నాయకులు తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, బోయిన మల్లేశం, ఆముదాల రంజిత్‌రెడ్డి, ఎర్రబోసు అశోక్, దాసరి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొంగరి వెంకట్‌మావో

ప్రజలను మోసం చేసిన రేవంత్ ప్రభుత్వం

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, జూలై 14: తెలంగాణ ప్రజలను మోసం చేసి రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టుల నుంచి నీళ్లు విడుదల చేసి కరువు నుంచి రైతులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. తొగుట మండలంలోని జప్తి లింగారెడ్డిపల్లిలో ఆదివారం ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి వాటర్ క్యాన్లు, చెత్త బుట్టలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉండేదని, కూడవెల్లి వాగు నిండుకుండలా ప్రవహించేదన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ద్వారా రామాయంపేట, దుబ్బాక ప్రధాన కాలువల ద్వారా చెరువు కుంటల్లో కూడా నీళ్లు నింపేవారన్నారు. కేసీఆర్ మీద కక్ష కట్టి కాళేశ్వరం ప్రాజెక్టు పేరున దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బక్క కనకయ్య, మండల యూత్ అధ్యక్షుడు మాదాసు అరుణ్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిలువేరి రాజిరెడ్డి, నాయకులు తగరం అశోక్, చెరుకు లక్ష్మారెడ్డి, నాయకులు సుతారి రమేష్, మంగ నర్సింహులు, మంగ యాదగిరి, పబ్బతి వెంకట్‌రెడ్డి, నందారం నరేందర్ గౌడ్, చిక్కుడు రమేష్, స్వామిగౌడ్, సుతారి రాములు, రాంబాబు, యెన్నం కొండల్‌రెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్‌ను కలిసిన గుళ్లపల్లి

చేర్యాల, జూలై 14: రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రియాజ్‌ను చేర్యాల పట్టణానికి చెందిన కవి, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల క్రాంతి కృష్ణ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ఎన్నిక

సిద్దిపేట అర్బన్, జూలై 14: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా గౌరవ అధ్యక్షుడు భాస్కర్ వెల్లడించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తేలు ఇస్తారు, జిల్లా అధ్యక్షుడిగా ఎండీ సాజీద్, ఉపాధ్యక్షులుగా సాయిలు ,యాదగిరి, లక్ష్మీనరసయ్య, సత్తయ్య జిల్లా కార్యదర్శిగా రమేష్, సహాయ కార్యదర్శులుగా లక్ష్మీ, కైలాసం, బాపూరావు, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా లింగం, నరేష్, కే లింగం, కిష్టయ్య, బాలరాజులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ పలు తీర్మానాలను చేసినట్లు నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

ఎస్ఐకి సన్మానం

కల్హేర్, జూలై 14: సిర్గాపూర్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డిని సిర్గాపూర్ మాజీ ఎంపీపీ జారా మహిపాల్‌రెడ్డి, నారాయణఖేడ్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రమావత్ రాంసింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్ రావ్ పాటిల్‌లు ఆదివారం నాడు వేర్వేరుగా సన్మానించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల కాపాడుటలో మీ వంతు పూర్తి సహకారం అందించాలని ఎస్ఐ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలు మానుకోవాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

బెజ్జంకి, జూలై 14: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలను మానుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మందపవన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో మంద పవన్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లు అమలు కాకపోవడంతో పది సంవత్సరాల కాలంలో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిరుద్యోగ సమస్య లేకుండా చూడాలని ఆయన కోరారు. రెండుసార్లు కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ బెజ్జంకి మండలానికి ఎన్ని నిధులు కేటాయించారో శ్వేతప్రతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్ రెడ్డి, మండల కార్యదర్శి రూపేష్, సహాయ కార్యదర్శి పరుశురాం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, మహేశ్, శ్రావణ్, లక్ష్మణ్, గుండయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో

చిన్నశంకరంపేట, జూలై 14: మండల పరిధిలోని గవ్వలపల్లి గ్రామంలో మంచినీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌రోడ్డు మెదక్- చేగుంట రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. గత 20 రోజుల నుంచి మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకుల నుంచి నీళ్లు రాక నానా అవస్థలు పడుతున్నట్లు మహిళలు చెప్పారు. నీటి సమస్యను పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శికి తెలియజేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. గత్యంతరం లేక పొలాల వద్దకు వెళ్లి బోరుబావుల నుంచి నీళ్లు తెచ్చుకోవలసిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేసి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సముదాయించేందుకు యత్నించినప్పటికీ మహిళలు వారితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు గ్రామంలో మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మిషన్ భగీరథ ఏఈ తిర్మలేష్, సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ మేరకు స్థానికులకు పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

త్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్, జూలై 14: మనూరు మండలం తిమ్మాపూర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు బాసర త్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ఆదివారం ఖేడ్‌లోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఒకే గ్రామం నుంచి నలుగురు త్రిపుల్‌ఐటీకి ఎంపికవ్వడం గొప్ప విషయమన్నారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి ఈ ప్రాంతానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్ నాయక్, చందర్, సుధాకర్, అనిల్, దావిద్, ఆకాశ్‌పాటిల్ పాల్గొన్నారు.

మూడోరోజుకు రైతుల రిలేదీక్ష

● సంఘీభావం తెలిపిన సీపీఎం



దీక్షలో మాట్లాడుతున్న సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు

నర్సాపూర్, జూలై 14: సంగారెడ్డి రీచ్ కెనాల్ కోసం తీసుకునే భూములకు సంబంధించి ఇచ్చే పరిహారం విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చే వరకు భూములు ఇవ్వమని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం మూడోరోజుకు చేరుకుంది. నంద్యాతండా, చిప్పల్‌తుర్తి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన మహేష్‌గౌడ్, జయరాంనాయక్, శ్రీనివాస్‌నాయక్, తరుణ్, రవి, రాజు, విటల్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, గోపాల్‌రెడ్డి తదితరులు ఆదివారం ఈ దీక్షలో పాల్గొన్నారు. మూడవరోజు దీక్షకు సంఘీభావంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. ఎటువంటి గ్రామసభలు పెట్టకుండా అధికారులు భూసర్వే చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదని అన్నారు. గ్రామసభలు పెట్టి స్థానిక రైతులను ఒప్పించి వారికి తగిన హామీ ఇచ్చాకే సర్వే చేయాలని డిమాండు చేశారు.

ఆత్మీయ సమ్మేళనం



మర్కుక్ మండలం పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-1992లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాములపర్తి సమీపంలోని ఓ కళ్యాణ మండపంలో 32 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

\- మర్కుక్



కొమురవెల్లి జడ్పీఎస్ఎస్ 1999-2000లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

\- చేర్యాల

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడి బహిష్కరణ

సిద్దిపేట అర్బన్, జూలై 14: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాటికొండ రవిని పార్టీని నుంచి బహిష్కరిస్తున్నట్లు పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆదివారం తెలిపారు. రవి కొంతకాలంగా పార్టీ క్రమశిక్షణకు, నియమాలకు విరుద్ధంగా వ్యవహరిసున్నాడని ఒంటెత్తుపోకడలతో నిర్ణయాలు తీసుకుంటున్నాడని, అందువల్లనే పార్టీ ఆయన్ని బహిష్కరిస్తున్నామని మల్లారెడ్డి తెలిపారు. ఇక నుంచి పార్టీకి రవికి ఎటువంటి సంబంధం లేదని, దీనిని పార్టీ శ్రేణులు, మీడియా మిత్రులు గమనించాలని కోరారు.

వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన గ్రామస్థులు



వాటర్‌బాటిల్స్ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

హుస్నాబాద్‌రూరల్, జూలై 14: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా ఆదివారం 250 మంది గ్రామస్థులు మొక్కలు నాటారు. పందిల్ల గ్రామంలో జీస్‌టౌన్‌షిప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలను నాటిన 250 మందిలో డ్రా ద్వారా 25 మందిని ఎంపిక చేసి స్టీల్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అయిలేని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షించిన వారికి రేంజర్ సైకిల్ బహుకరించనున్నట్లు తెలిపారు.

కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి

● అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ అనిల్‌కుమార్

జగదేవ్‌పూర్, జూలై 14: మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో ఉన్న శ్రీకొండపోచమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు భారీగా దర్శించుకున్నారు. ఆషాఢమాసం ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తెలెత్తకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆదివారం సాయంత్రం కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎంపీకి ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. ఎంపీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే టీపీసీసీ అధికార ప్రతినిధి బండారి శ్రీకాంత్ రావు కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆషాఢమాసం సందర్భంగా కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నామన్నారు. వర్షాలు కురిసి పాడి పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, మహేందర్‌రెడ్డి, భానుప్రకాష్‌రావు, రాజు, మురళి, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, సుధాకర్, లక్ష్మణ్, హరి తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ ఆశ్రమంలో ఆషాఢ ఉత్సవాలు

మర్కుక్, జూలై 14: మండల పరిధిలోని భవానందాపూర్ గ్రామ శివారులోని పాండురంగ ఆశ్రమంలో ఆషాఢ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హరేరామస్మరణతో మారుమోగింది. ఉదయం శ్రీసీతారామచంద్రులకు క్షీరాభిషేకం, పుష్పార్చనలు నిర్వహించారు. అంతకుముందు పాండురంగ ఆశ్రమ నిర్వాహకులు నిర్వహించబోయే శతకోటి హరే రామనామ జపయజ్ఞంలో భాగస్వాములు కావడానికి 65 గ్రామాలకు చెందిన భగవత్ సేవా సమాజం శాఖలు వివిధ మార్గాల ద్వారా భగవందామ శోభాయాత్రల ద్వారా పాండురంగాశ్రమానికి చేరుకుని, హరే రామ నామస్మరణలో తన్మయత్వంతో పాండురంగని ముందు నృత్యం చేస్తూ భక్తిభావాన్నిపెంపొందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాండురంగాశ్రమ భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కోటిపార్థివ లింగ మహాయజ్ఞం

దౌల్తాబాద్, జూలై 14: దొమ్మాట, గాజులపల్లి, దక్షిణ కాశి కైలాసపురంలో నిర్మితమవుతున్న శివుని ఆలయ ప్రాంగణంలో నేడు తొలి కోటి లింగా పార్థివ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు చాముండేశ్వరీ గురుదత్త పీఠం బ్రహ్మ శ్రీ కొడకండ్ల శ్రీరామ్‌చరణ్‌శర్మ గురూజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



మర్కుక్: రామభజన చేస్తున్న భక్తులు

సౌత్‌సర్కిల్‌ను ప్రైవేట్ పరం చేయాలని చూస్తే ఉద్యమం తప్పదు

● టీఎస్‌యుఈఈయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

నర్సాపూర్, జూలై 14: విద్యుత్ సంస్థల్లో భాగమైన సౌత్ సర్కిల్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు యత్నిస్తే ఉద్యమం తప్పదని సీఐటీయూ అనుబంధ టీఎస్‌యూఈయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో ఆదివారం మెదక్ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రైవేటు పరం చేయడానికి సౌత్ సర్కిల్‌లో సర్వేలు కూడా చేస్తున్నారని, దీనిని విరమించుకోవాలన్నారు. మెదక్ జిల్లాలో ఆర్టిజన్స్ అధికారుల వేధింపులు ఆపాలని, జిల్లాలోని అన్ని సబ్‌స్టేషన్లలో మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్, నర్సింహులు, సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షులు నాగరాజు, సురేష్,శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలి

● ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య

చిన్నశంకరంపేట, జూలై 14: బదిలీ అయిన ఎస్‌జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై ఆదివారం హైదరాబాద్ కాజీగూడలోని మెదక్ జిల్లా ఎస్టీయూ ఆధ్వర్యంలో ఎస్టీయూ రాష్ట్ర అధక్షుడికి మెమోరండాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిగిలిపోయిన ఎస్ఏ, పీఎస్‌హెచ్ఎమ్, పీజీహెచ్ఎమ్‌లను ప్రమోషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధ్యక్షుడిని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజాగోపాల్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా నాయకులు నరేష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.